
# నాన్నా! నిన్ను క్షమించలేను!

- అవసరాల రామకృష్ణారావు




సజల నయనాలతో దండ వేసి వున్న తండ్రి ఫొటో వైపు చూసింది సావిత్రి. ఓ జీవితకాలమంతా ఓ మనిషి మీద పెంచుకున్న విశ్వాసానికి విఘాతం కలగడమనేది ఆమె సహించలేకపోయింది. ఎంతో గౌరవించిన, ఆదర్శ పురుషుడని ఆరాధించిన తన తండ్రి నియమాన్నే తను అంగీకరించలేకపోతే, తన పిల్లలకీ మనవలకీ రేప్పొద్దున్న ఏం చెప్పగలుగుతుంది! విచక్షణా రహితమైన సత్ప్రవర్తనకే మనవాళ్లు సాంప్రదాయమని పేరు పెట్టారు. అలాంటిది ఏం మిగిలిందని తన వాళ్లకి అందించడానికి! ఎన్ని పనులున్నా ఏ రోజుకారోజు ఓ పావుగంటైనా తన మనసు అక్కడ కూలబడకుండా ఉండలేదు. జవాబు దొరకని ప్రశ్నలతో వేధించక మాననూ మానదు.

ఆయన చిన్న కుటుంబంలోని సభ్యులే కాదు, చేసిన పెద్ద ఉద్యోగానికి సంబంధించిన అశేష ప్రజ సీతారామయ్య గారిని ఓ పరమ పవిత్రమూర్తిగా భావించేవారు. తల్లీ తండ్రీ చిన్నప్పుడే పోతే ఉన్న ఒక్క మేనమామా ఆయన ఆస్తిని మాత్రం చేరదీసి, అబ్బాయికి మాత్రం వారాలు ఏర్పాటు చేశాడు. అలా నష్టపడి బతికి,

కష్టపడి చదివి, స్వయంశక్తితో సాధించి అనాథ ప్రేత అనుకున్నవాడు, అన్నిట్లోనూ విజేత అనిపించుకున్నాడు. "ప్యూన్ పనికైనా పనికొస్తాడా" అని ఎకసక్కెం చేసిన వాళ్ల చేతే డిప్యూటీ డైరెక్టర్‌గా రిటైరై ముక్కున వేలేయించుకునేలా చేశాడు.

ఇప్పట్లో ఇంతగా తగలబడి పోకపోవచ్చుగానీ కాలం అనేది ఎప్పుడైనా అంతో ఇంతో తగలడుతూనే ఉంది. ఎక్కడ ఏం జరిగినా మరుక్షణం నలుగురికీ తెలిసిపోయే ఈనాటి మీడియా వెసులుబాటు ఆ రోజుల్లో లేకపోబట్టే ఎక్కడలేని నేరాలూ పైకి పొక్కకుండా ఉండిపోయేవేమో. లేకపోతే సావిత్రి వేలువిడిచిన మేనమామ లాంటి బిల్లు కలెక్టరు ఉద్యోగం చేసినవాళ్లు నాలుగేసి ఇళ్లు ఎలా కట్టగలిగారు.

ఆ రోజుల్లోనే అంత పెద్ద ఉద్యోగం వెలిగించినా, పెళ్లాం బిడ్డలు ఎంత గోల పెట్టినా ఓ మంచి భవనం అన్నది నిలబెట్టుకోలేకపోయాడు. నీతి నియమాలే అన్నిటికన్నా పెద్ద నిధి అని అక్షరాలా ఆచరించి చూపిన సీతారామయ్యగారు. నీతి అంటే ఆయన ఉద్దేశంలో ఏటా తిరుపతిలో కళ్యాణం చేయించుకు రావడం కాదు, నియమం అంటే వేళ తప్పకుండా త్రిసంధ్యల్లో గాయత్రీ మంత్రం జపించడమూ కాదు. విద్యుక్త ధర్మం అనే దానికి ఆయన నిర్వచనమే వేరు. చిన్నప్పట్నుంచీ తండ్రి వ్యక్తిత్వంలోని ప్రత్యేకత గమనిస్తున్నకొద్దీ- విప్పారి చూస్తున్న తన కళ్లు అలాగే ఉండిపోతాయేమో. చెప్పాపెట్టకుండా తననుంచి అంతటి గౌరవాన్ని చూరగొంటున్న తనకు అందకుండా పోతాడేమో అనే భ్రాంతి కలిగేది. ఆయన కఠోర నియమాలను తట్టుకోలేక అన్నయ్య అమ్మతో కలసి ఎదురు తిరిగితే పైకి చెప్పలేని చిన్నతనం అయినా సావిత్రి మనసెప్పుడూ తండ్రి వైపే మొగ్గు చూపేది.

అన్నయ్య రామానికి పెళ్లయినప్పుడు సావిత్రి వయసు పదకొండో పన్నెండో. తెలిసీ తెలియని జ్ఞానం. నాన్న ఆశయాలకి విరుద్ధంగా అన్న పాతికవేల కట్నం, అమ్మ పది తులాల బంగారం రహస్యంగా అందుకుని కోడల్ని ఇంటికి తెచ్చుకున్నారని రుజువై సీతారామయ్య ఆత్మాహుతిగా భావించాడు. ఇంటిపెద్దగా ఆ దండన తన మీద వేసుకుని, పుచ్చుకున్న సొమ్మంతా వియ్యంకుడికి వడ్డీతో సహా తిరిగి ఇవ్వడానికి ఆయనకి మూడేళ్లు పట్టింది. "సొమ్మయితే తిరిగి ఇచ్చెయ్యగలం, చేసిన సిగ్గుమాలిన పనిని ఎలా కప్పెట్టుకోగలం?" అనే అంతర్మథనాన్ని తల్లీ కొడుకులతో సహా బంధుజనమంతా పిచ్చిసన్నాసి వెర్రి ప్రేలాపనగా జమకట్టింది. తల్లి అయితే తప్పదు గనుక ఉండిపోయింది కానీ "ఈయనతో ఉంటే ఇక సుఖపడ్డట్టే" అంటూ కాపరానికి తీసుకుపోయింది.

సావిత్రి పెళ్లి విషయంతో సహా సీతారామయ్య తీవ్ర ఘర్షణకి లోనయ్యాడు. వరకట్నమనేది పరమ దరిద్ర లక్షణంగా భావించడమే కాక, దాన్ని అమల్లో పెట్టే ఆదర్శం కొందరు కొడుకుల్ని కన్న తండ్రుల ఓ గొప్ప ఆచారంగా చలామణి అయినా దాన్నే చచ్చు సంప్రదాయంగా భావించి, కొడుకుల్ని అమ్ముకోని నీతిమంతులు అరుదుగా అయినా తారసిల్లవచ్చు. కానీ "మా అమ్మాయికి పైసా కట్నం ఇవ్వం. లాంఛనాలు జరపం. వీలైనంత క్లుప్తంగా పెళ్లి జరిపించేస్తే సంతోషిస్తాం" అంటూ కన్యాదాతలే బయల్దేరితే పిల్లాణ్ణి ఇచ్చే సాహసవంతులు ఏ కాలంలో అయినా ఎందరని! అందుకే పోస్టుగ్రాడ్యుయేట్ అయితే అయింది గాని పెళ్లయి పిల్లల తల్లి కాలేకపోయింది. పుట్టుకతో వచ్చిన మధుమేహంతోపాటు "గుండెల మీద కుంపటి" విషయంలో బంధువుల సూటిపోటి మాటలు తోడై సీతారామయ్య గారి సతీమణి కూతురి పెళ్లి చూడకుండానే కన్నుమూసింది. ఇంకో ఆరునెలలకి రిటైరు అవుతాడనగా ఎలాగైతేనేం ఆయన కూతుర్ని ఓ ఇంటిదాన్ని చెయ్యగలిగాడు. లోకమంతా లౌక్యంతోనే నిండిపోలేదు గనుక ఆదర్శప్రాయుడూ సహృదయుడూ అయిన అల్లుడే దొరికాడు.

ఇదంతా ఎప్పటి మాట! తండ్రి ఫొటో చూసుకుంటూ సావిత్రి మనసు ఎందుకిదంతా నెమరు వేసుకుంటోంది? ఇంతగా ఆరాధించిన ఆదర్శ ప్రాయుణ్ణీ ఆత్మీయుణ్ణీ ఆమోదించలేకపోతోందేం? భవిష్యత్తు చక్కదిద్దుకోవాలని వర్తమానంలో నిర్ణయించుకుంటే, గతంలోకి మనోగతం మరోసారి మళ్లవలసిందే. తనే జీవితాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోతే రేప్పొద్దున తన కొడుక్కి పరంపరాగతంగా ఏం అందివ్వాలి? ఆలోచించిన కొద్దీ ఆమె బుర్ర వేడెక్కి పోతోంది.

ఆధ్యాత్మికతను ఆచరించగలమనే విశ్వాసం గల ఆనాటి ఆదర్శవాదులకు ప్రతినిధి సీతారామయ్య గారు.

## అభివృద్ధి

ఒక యిల్లు శిథిలమై
పది గుడిసెలుగా మారడం
పేరుకున్న కలవారి పుణ్యాన్ని ఏరుకునేందుకు
ఒక్క జోలె వంద జోలెలుగా పోటీపడటం
... ఇదే కదా అభివృద్ధి అంటే...!
ఆకలి మంటకు పేగులు
ఆక్టోపస్ రూపం దాల్చడం
గుండె మడిలో నాటిన విషాదం
వేల కన్నీటి బొట్లు కాయడం
పదడుగుల బక్క రోడ్డు
వందడుగులు అడ్డంగా బలవడం
నిజంగా అభివృద్ధే కదా...!
కుడి ఎడమల జిలుగు మేడలు అనుసరిస్తేనే
కదా
కూటికి గతిలేని బడ్డీకొట్లను కూలేసి
రోడ్లయినా రాజకీయ దర్పంతో ముందుకు
సాగేది!
పుల్లా పుడకా పోగేసి
రోడ్డు కొమ్మల్లో కట్టిన గూళ్లు
ఒక్క అభివృద్ధి గాలివానకు కొట్టుకుపోతే
సర్కారు వారు సంతోషం; చంకలు
గుద్దుకుంటుంది కదా!
ఆకలే కదా ఎవరికైనా అసలు సమస్య?
అసలా ఆకలి పొట్ట ఉండబట్టే కదా?
నడిరోడ్డు మీద బుల్‌డోజర్ పల్టీగ్గా పొట్టలు
కొడుతుంటే
సమస్య తీరుతున్నందుకు సంబరమే కదా!
కాకిని కొట్టి గద్దలకేసే
గద్దెలమీది పెద్దల్లారా!
ఇంతోటి భాగ్యానికి-
బడ్జెట్ మాయాపల్లకిలో బడుగు వర్గాలను
హామీల బాజా భజంత్రీలతో
ఊరేగించడమెందుకు?

- డా.. దిలావర్

## ఆత్మవంచన

ఎందుకీ దీపాల పండుగ
ఏం సంతోషముందని
ఈ దివ్వెల పండుగ?
మదిలో తిమిరం కరగలేదు
మనిషిలో ఆలోచన ఎదగలేదు
దిగులు రగుల్తున్న గుండెలో
ఆటంబాంబులు పేలుతూంటే
దిక్కుతోచని దీన స్థితిలో
దీపావళి ఎలా జరుపుకోను?
తరతరాల నుండి ధరణిపై
ఎన్నెన్ని దీపావళులు
మహోజ్వలంగా నాట్యమాడలేదు
ఎన్ని ఆశలు అంతరంగంలో
విష్ణుచక్రాలై పరిభ్రమించలేదు
ఏ దీపావళి గానీ
మనుగడలో వెలుగు నింపిందా?
మనసులో చీకటి, మహిలో చీకటి
అవినీతి చీకటి, అభద్రతా చీకటి
కారుచీకట్లు తప్ప కాంతిరేఖలు లేవు
జువ్వలెన్నో తారలతో సయ్యాట లాడలేదా
ఎన్నెన్నో మతాబులు
చీకటిని చెదరగొట్టి కనువిందు చేయలేదా?
గుండెలదరగొట్టే టపాసుల మోతలు
నిశీధిలో ప్రతిధ్వనించలేదా?
అయినా ఏం లాభం
అంతా తాత్కాలికం, యధాతథం
పిడికెడు గుండె కుదించుకుపోతూంది
పేదవాని కడుపు ఆకలి మంటతో
దహించుకుపోతూంది
ఎందుకీ దీపావళి
ఎటు చూసినా తిమిరావళే
అంతా ఆనందమేనని ఆత్మవంచన తగదు!

- వి.ఎస్.ఆర్.మౌళి

పెద్దలు చెప్పిన నీతిపథాన్ని మనసా వాచా మరి ప్రశ్నించకుండా ఆచరించడం, ఏదైనా అనుకోనిది ఎదురైతే కర్మ సిద్ధాంతానికి ముడిపెట్టి ధైర్యంగా ముందడుగు వెయ్యడం అప్పటి సరళ జీవనుల సాహస విధానం. అందుకే రామానికీ, సావిత్రికీ మధ్య పుట్టిన ముగ్గురు పిల్లలు మరణించినా, ఉన్న ఒక్క కొడుకూ వేరుపడినా, కూతురి పెళ్లి బాధ్యత తలదాల్చకుండా కట్టుకున్నదే కన్నుమూసినా ఆయన చలించలేదు. భార్య పోయాక, కూతురికి పెళ్లి చేసి పంపించేశాక, రిటైరయ్యాక కూడా ఆయన ఎవరి మీదా ఆధారపడదల్చుకోలేదు. ఆయన్ని మొదట్నుంచీ కనిపెట్టుకుని వున్న ఓ మేనత్త లేకపోలేదు గాని ఆ చివరి రోజుల్లో ఈయన ఆవిడకి చేసే సేవే ఎక్కువ.

సావిత్రి వయసు నలభై చేరే నాటికి సీతారామయ్య గారి ఆరోగ్యానికి క్షీణదశ ఆరంభమైంది. అంతకు ముందే మొగుడి చేత తండ్రికి ఉత్తరం రాయించింది. తమ దగ్గిర వచ్చి ఉండమనీ, కొడుకుతో ఎలాగూ పడదు గనక కూతురి దగ్గరే ఎట్టి అభ్యంతరం లేకుండా ప్రశాంతంగా తన చివరి కాలం గడపమనీ. కేవలం కృతజ్ఞతల్తో దాటవేసి, అక్కడితో ఊరుకోకుండా అన్నయ్యని బ్రతిమాలుతూ తండ్రి ఉత్తరం రాయడం సావిత్రికి కొరుకుడు పడలేదు. వదిన ఆ ఉత్తరం తన పేర తిరిగి పంపింది. ఇంతకీ సీతారామయ్యగారు కొడుక్కి రాసిందిదీ: "చిట్టీ! వేరు పడ్డావు గానీ మన మధ్యనున్న వేరు తెగిపోదు కదా. నాకా కాలం చెల్లింది. ఈమధ్య మా మేనత్త కూడా నన్ను మరింత ఒంటరి వాణ్ణి చేసి వెళ్లిపోయింది. నీ దగ్గిరే కన్నుమూయడం నా ధర్మం కదా. నువ్వొచ్చి నన్ను తీసికెడతావో, ఎవర్నైనా తీసుకుని నీ దగ్గిర చేరుకోమన్నావో రాయి. ఎప్పటికైనా తలదాచుకోడానికి ఉంటుందని ఓ ఆప్తుడు బలవంతం చేస్తే ఈ బొక్కి కొంప కొన్నాను. ఇంకా ఈ బాధ్యత నాకెందుకు? ఈ ఇల్లు నీ పేర రాసిన విల్లు కాగితం దీనితో పంపిస్తున్నాను. ఈ చరమ దశలో నన్ను ఉద్ధరించు.''– నాన్న. వదిన తన స్వభావం బయటపెట్టింది తనో ఉత్తరం రాసి, దాన్తో జోడించి: "మీరేదో ఆయన్ని మహాత్ముడంటారు. చేసే దగుల్బాజీ పనులు చూస్తే ఇలాంటివి. అంత పెద్ద ఉద్యోగం చేసినా, పట్టుమని పది లక్షలైనా మిగుల్చుకోలేకపోయిన అదీ ఓ బతుకే? ఉన్నమాట అనకుండా ఉండలేను, ఎవరేమనుకున్నా సరే! బోల్డంత గ్రాట్యుయిటీ వస్తుంది. ప్రావిడెంట్ ఫండ్ సరేసరి. నెలనెలా పెన్షన్ సంగతి ఏమిటి? ఇవన్నీ మీకు ముట్టచెబుదామని ఉద్దేశం కాకపోతే, వాటి మాట ఎత్తకుండా ఆ బోడి పెంకుటి కొంప మాకెందుకు! కుక్కి మంచం లాంటి ఆయన్నే ఆ బొక్కి కొంపలో ఉండనివ్వండి. వ్యాపారంలో నష్టం వచ్చి తట్టుకోలేక, ఉన్న ఒక్క కొడుక్కీ కాలేజీ ఫీజులు కట్టలేక, నానా అవస్థల్లో మునిగి తేలుతున్నాం మేం. లేనిపోనివి తలకెక్కించుకునే బుద్ధితక్కువ మీ అన్నయ్యకున్నా నేనెంత మాత్రం పడనివ్వను."

సమస్య ఇంత తీవ్రంగా ఉందని గ్రహించనందుకు తనని తాను తిట్టుకుంది సావిత్రి. తోడూ నీడా లాంటి మొగుడు కొందరు ఆడవాళ్లకైతే దొరకొచ్చు. ప్రాణస్నేహితురాలి లాంటి అత్తగారు దొరకడం అతి అరుదైన అదృష్టం. అంతేనా! ఒక్కడే కొడుకైతేనేం? ఏ క్లాసులో అయినా వాడివి ఏక్లాసు మార్కులే. ఆ ఊళ్లోనే హాస్టల్లో చదువుతున్న అన్న కొడుకు మురళి గాడు కూడా అన్నిట్లో ఫస్టేగానీ వీడిలా ర్యాంకరు కాదు. అదృష్టవశాత్తూ వాడికి తల్లి పోలికలు రాలేదు. ఏ వారానికైనా ఓసారి వస్తాడు. తలంటి పోసి వాడికి కావలసినవి చేసి తినిపిస్తుంది. ఎంతైనా మేనల్లుడు కదా! అదీగాక మురళీ తన కొడుకు మోహనూ క్లోజ్ ఫ్రెండ్స్ కూడా.

అన్నీ బాగానే వున్నాయని సావిత్రి మురిసిపోయినంతసేపు పట్టలేదు. ఎంతో నీతి నియమాలతో బతికిన తన తండ్రిని నిస్సహాయ స్థితిలో అలా వదిలెయ్యడానికి ఆమె ఆడమనసు ఎంతమాత్రం ఒప్పుకోలేదు. వదిన ఉత్తరం చూసి భగభగ మండిపోయింది ఆమె హృదయం. వెంటనే టెలిగ్రాం ఇచ్చి అన్నని పిలిపించి మాట్లాడాలనుకుంది. ఇవన్నీ తండ్రికి పంపి "చూశావా, నీ కొడుక్కీ కోడలికీ నీ మీద ఎంత ప్రేమ ఉందో– నేను ఆయన్ని తీసుకుని వస్తున్నాను. అన్నీ సర్దుకుని మాతో రావడానికి రడీగా ఉండు" అని అల్టిమేటమ్ ఇవ్వాలనుకుంది. కాలేజీ చదువులదాకా వచ్చారు కదా, కొడుకునీ మేనల్లుణ్ణీ కూచోబెట్టి అన్నీ బోధపరచాలనుకుంది. కానీ ఇందులో ఏ ఒక్క మార్గమూ అనుసరించడానికి తన ఆప్తులైన భర్తా అత్తగార్లూ ఆమోదించలేదు. ఉద్రేకంతో ఏ నిర్ణయమూ తీసుకోకూడదని చెబుతూ తను మరచిపోయిన ఒకటి రెండు ముఖ్య విషయాలు గుర్తు చేశారు.

సీతారామయ్య గారనే కుక్కిమంచం అక్కర్లేదు గానీ వదినకి ఆ బొక్కి కొంప మాత్రం కావాలి, వదినకే కాదు అన్నయ్యకి కూడా. రిజిస్టర్ పోస్టులో విల్లు అతనే అందుకున్నాడు కదా– దాన్ని ఆ ఉత్తరాల్తో తిరిగి పంపలేదేం! అదీకాక, అక్కర్లేదని చెబుతూనే ఇంకా ఏవేం కావాలో ఇన్‌డైరెక్టుగా ఆవిడ సూచించింది కూడా. కాబట్టి వాళ్లు నూటికి నూరుపాళ్లు డబ్బు మనుషులు. ఇక సీతారామయ్య గారు? సెంట్ పర్సెంట్ సెంటిమెంటు మెంటల్ సరుకు. వాడెలాంటివాడైనా సరే కొడుకు చేతిలో చావవలసిందే. అంతకుముందు కొడుకనేవాడు కొన్ని వందల సార్లు మనసనే దాన్ని మంటపెట్టినా సరే. "అంచేత నువ్వేం చెయ్యలేవు" అని వాళ్లిద్దరూ ఎంత చెప్పినా "ఏదో ఒకటి చేసి తీరాలనే'' మానవత్వం సావిత్రిని నిలవనివ్వలేదు. "నాకీ ఒక్క సహాయమూ చెయ్యండి. నేనేం చేసినా అడ్డుపడకండి" అంటూ మొగుడిచేత ఒట్టేయించుకుని ఆ ఊరు తీసికెళ్లింది. చేయరాని సాహసమే చేసింది. ఆస్తి కోసమే తనిదంతా చేసిందని, రేప్పొద్దున తోడబుట్టిన వాడే కోర్టుకెక్కనీ.

చుట్టపు చూపుగా వచ్చినట్టు తండ్రితో చెప్పింది. అప్పటికే సీతారామయ్య గారు అవసాన దశతో, తెరిపి మరిపి అన్నట్టున్నారు. అన్నయ్య దగ్గరకి తీసుకెడుతున్నానని అబద్ధమాడి టాక్సీ చేయించి తన ఊరు తీసుకొచ్చేసింది. ఇక తప్పని పరిస్థితుల్లో ఇలా తీసుకు రావలసి వచ్చిందనీ, వచ్చి చూడమనీ, తీసుకు వెళ్లమనీ, నిజంగానే రామానికి తెలియబరచింది. అందినట్టు కూడా జవాబు లేదు.

ఆ తర్వాత సీతారామయ్య గారు మహా బతికితే రెండు వారాలు బతికారేమో! సావిత్రి అహోరాత్రాలు తండ్రికి సేవ చేసింది. కన్నతల్లిలా మలమూత్రాలు ఎత్తిపోసింది. అత్తగారూ, భర్తా కూడా ఎంతగానో సహకరించినా, ఎంత వద్దన్నా కాలేజీకి సెలవు పెట్టి తల్లికి కంటికి రెప్పలా ఇరవై నాలుగ్గంటలూ నిలబడ్డవాడు మోహనే.

ఆ రాత్రి గడవడం కష్టమని డాక్టరు చెప్పినా సీతారామయ్య గారు కొడుకు కోసం కలవరించడం మానలేదు. ఇక బతకనని స్పష్టంగా తెలిసిన క్షణం నుంచీ చిట్టి కోసం అతని జీవుడు కొట్టుమిట్టాడి పోయింది. చివరి క్షణంలో ఆయన కోరిక సావిత్రి అరాయించుకోలేకపోయింది. అంతవరకూ మోహన్ ఒళ్లో పడుకుని వెక్కిళ్లు పడుతున్నవాడు ఒక్కసారి లేని సత్తువ తెచ్చుకుని అతన్ని తోసేశాడు. దూరంగా కనిపిస్తున్న మురళిని సైగ చేసి పిలిచాడు. అతని ఒళ్లో తలపెట్టుకుని ఆఖరి శ్వాస విడిచాడు.

ఎంతటి సంస్కారి గానీ సదాచార సంపన్నుడు గానీ తండ్రి చూపిన ఆ వివక్ష సావిత్రి జన్మలో క్షమించలేదు. మోహన్ అయితే కూతురి కొడుకు. మురళిగాడయితే కొడుకు కొడుకు! ఇలాంటి తలకొరివి బుద్ధులకి తలకొరివి పెట్టే మహోన్నత మానవ స్థితికి చేరుకోనంత కాలం వారసత్వం అంటే వార్ తత్వమే కదా! కలకబారిన మనసుని కట్టుదిట్టం చేసుకునే ప్రయత్నంలో ఉంది సావిత్రి. ●

## గోడ

ఎవరు తిప్పకపోయినా
భూమి పరిభ్రమిస్తూనే ఉంది
ఎవరు తరమకపోయినా
కాలం పరుగెడుతూనే ఉంది
ఇదంతా సృష్టి రహస్యమో?!
విశ్వం విజయ సంకేతమో?!
మరైతే ఇదేమిటి?
తొలిజాము కోడి గొంతు విప్పకముందే
నిద్రపోయిన నిన్నటి సూర్యుడు నిద్ర లేవకముందే
వాడు నాతో పోటీపడి పరుగెత్తుతున్నాడు
ఇద్దరివి ఉరుముల మెరుపుల లాంటి
ఉరుకులు పరుగులే–
వాడు తిన్నదరక్క బ్రతకటం కోసం
నేను తిండి దొరక్క బ్రతుకుతెరువు కోసం
ఇద్దరిది అదో మాయదారి రోగమే
వాడిది అరగని రోగం
నాది ఆకలి రోగం
వాడికి ప్రతిరోజు పండుగే
నాకు ఏ రోజైనా దండుగే
వాడి గుండె కొవ్వు చేరి బరువైంది
నా గుండె బతుకు బరువై భారమైంది
ఇద్దరి జీవితాల్లోనూ నీరే
వాడి జీవితమంతా పన్నీరే
నా కంటి నుండి కాలువ కట్టేది కన్నీరే
వాడిది నాది ఒకే తీరనిపిస్తుందా?
పరమార్థంలో తేడా మీకగుపిస్తుందా?
వాడికి నాకు ఎందుకీ తేడా?
ఎవరుంచారు మా మధ్య ఈ అంతరాల గోడ?

– ఎన్. జయన్న